ప్రజాశక్తి

శుక్రవారం 5 డిసెంబర్ 2025 5 అనంతపురం



రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ


జిల్లాలో రోడ్డు భద్రతా చర్యలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రోడ్డు భద్రతా సమావేశాన్ని ఎస్పీ పి.జగదీష్‌తో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై విస్తతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతపురం నగరంలో గుర్తించిన పార్కింగ్ ప్రాంతాల్లో వచ్చే నెలలోపు అందుబాటులోకి తేవాలన్నారు. రోడ్డు భద్రతలో భాగంగా గుర్తించిన బ్లాక్ స్పాట్‌లలో కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలు జరిగినా గోల్డన్ అవర్‌లో బాధితులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించేలా చూడాలన్నారు.

డ్రగ్స్, గంజాయిని నిర్మూలిద్దాం

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాలో డ్రగ్స్, గంజాయి సమస్యను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్‌లు సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మాదకద్రవ్యాలు, గంజాయి నియంత్రణ చర్యలపై అవగాహన కార్యక్రమాల సమీక్ష(ఎన్‌సిఒఆర్డీ) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నశా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని డ్రగ్స్, గంజాయిపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. డీ-అడిక్షన్ సెంటర్, ప్రిజన్ వార్డ్‌లకు అవసరమైన మరమ్మతులు చేయాలన్నారు. ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 గురించి ప్రజలకు మరింత విస్తృతంగా తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఎ.మలోల, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.రామ్మోహన్ రెడ్డి, ఇంటెలిజెన్స్ బ్యూరో డీఎస్పీ రాజగోపాల్, డీఎస్పీ శ్రీనివాసరావు, డీఈవో ప్రసాద్ బాబు, డివిఇఒ వెంకటరమణ నాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిధుల మళ్లింపుపై మీనమేషాలు..!

◆ లెక్కలు తేలినా చర్యలు శూన్యం ◆ పశుసంవర్ధక శాఖ అవినీతిపై చర్యలేవీ..?



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా పశుసంవర్ధక శాఖలో వెలుగులోకి వచ్చిన అవినీతిపై ఇప్పటి వరకు చర్యల్లేకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇప్పటికే రాష్ట్ర ఆడిట్ అధికారులు కూడా నిధుల మళ్లింపుపై విచారణ చేపట్టి ప్రభుత్వ సొమ్మును ఏ రకంగా దుర్వినియోగం చేసారన్నది తేల్చింది. ప్రధానంగా నలుగురు వ్యక్తులు ప్రభుత్వ ఖాజానలో ఉండాల్సినవి తమ సొంత ఖాతాల్లోకి మళ్లించడం డ్రా చేయడం జరిగింది. ఈ రకంగా ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జులైలోపు రూ.1.01 కోటి రూపాయల నిధులను కాజేశారు. ఈ విషయాలను స్పష్టంగా తేలినప్పటికీ ఇప్పటి వరకు వారిపై కనీస చర్యల్లేకపోవడం గమనార్హం.

అనుమతుల్లేకుండానే రూ.1.01 కోటి డ్రా

అనంతపురం పశుసంవర్ధక శాఖకు సంబంధించి వివిధ పద్దుల కింద ఐదు బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. వీటిల్లో వాడకుండా ఉన్న డబ్బులు కొన్నేళ్లుగా ఉంటూ వస్తున్నాయి. వాటిని వాడాల్సి ముందుగా అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఈ రకంగా ఐసిఐసిఐ, యాక్సిస్, స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, కోటాక్ మహంద్రా బ్యాంకుల్లో ఖాతాలున్నాయి. ఈ ఖాతాల్లో నుంచి నలుగురు వ్యక్తులు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జులైలోపు ఎటువంటి అనుమతుల్లేకుండానే నలుగురు సిబ్బంది డబ్బులను డ్రా చేయడంతోపాటు నేరుగా ఇతర ఖాతాల్లోకి ఆర్టీజీఎస్ ద్వారా మళ్లింపు చేసిన దాఖలాలున్నాయి. మొత్తంగా రూ.1.01 కోటి రూపాయలు ఈ రకంగా మళ్లించారు. ఇందులో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతా నుంచి రూ.15 లక్షలు, ఐసిఐసిఐ బ్యాంకు నుంచి రూ.22 లక్షలు, యాక్సిస్ బ్యాంకు నుంచి రూ.27 లక్షలు, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా నుంచి రూ.15 లక్షలు డ్రా చేసినట్టు విచారణలోనూ గుర్తించారు.

నలుగురు పేరుతో నగదు డ్రా

పశుసంవర్ధక శాఖలో నిధులు కాజేసిన వ్యవహారంలో నలుగురు వ్యక్తుల పేర్లు బయటకొచ్చాయి. ఇందులో ఆంజినేయులు నాయక్ నేరుగా ఆయన పేరున డ్రా చేసిన మొత్తం రూ.11.94 లక్షలుంది. అదే కార్యాలయంలో పనిచేసే మరో మహిళా ఉద్యోగిని బి.సుశీల పేరున రూ.12.72 లక్షలు చేశారు. వీరు కాకుండా గాండ్ల దినేష్ పేరున రూ.16.09 లక్షలు, రమావత్ వంశీ పేరున రూ.12.25 లక్షలు నేరుగా డ్రా చేశారు. ఇక ఈఏడాది జులైలో ఎటువంటి అనుమతుల్లేకుండానే రూ.23.40 లక్షలు ఆర్టీజీఎస్ ద్వారా వేరే ఖాతాలకు మళ్లించారు. ఏప్రిల్‌లో ఆరు లక్షలు, జూన్‌లో రూ.6.50 లక్షలు వేరే ఖాతాల్లోకి మళ్లించారు. ఈ రకంగా మొత్తం రూ.1.01 కోటి ఇప్పటి వరకు మళ్లించినట్లు ఆధారాలున్నాయి. ఇవికాకుండా ఇతర పద్దుల కిందనున్న వాటిని మళ్లించినట్లు సమాచారం. దీనికి సంబంధించి ఆధారాలు లభించలేదు. ఈ మొత్తం వ్యవహారంలో చాలాకాలంగా ఇక్కడే పాతుకుపోయి పనిచేస్తున్న ఒక ఉద్యోగికి కీలకపాత్ర పోషించినట్లు ప్రచారం జరుగుతోంది.

ఇప్పటి వరకు చర్యలు శూన్యం

పశుసంవర్ధక శాఖలో ఇప్పటి వరకు ఇంత పెద్దఎత్తున నిధులను దారి మళ్లించి ప్రభుత్వ సొమ్మును కాజేసినప్పటికీ ఎటువంటి చర్యల్లేవన్న విమర్శలున్నాయి. నలుగురు నేరుగా నిబంధనలకు విరుద్ధంగా నిధులు డ్రా చేసినట్టు ప్రాథమిక విచారణలోనే స్పష్టమైంది. అయితే వీరిపై ఇప్పటి వరకు అధికారిక చర్యలేవి లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

అప్పుల బాధతో అరటి రైతు ఆత్మహత్య

అరటి రైతుల కష్టాలు ఆత్మహత్యల వరకు వెళ్తు న్నాయి. చేతికందిన పంట ధర పడిపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పంట కోసం చేసిన అప్పులు తీర్చేమార్గం లేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొంది. అప్పల ఊబి తాళలేక పుట్లూరు మండలంలో ఓ అరటి రైతు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పుట్లూరు మండలం వెల్లుట్ల గ్రామానికి చెందిన అరటి రైతు నాగలింగం(44) పంట కోసం చేసిన అప్పులు తీర్చేమార్గం లేక తన అరటి తోటలోనే పురుగుల ముందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ ఘటన అరటి రైతుల కష్టానికి అద్దం పడుతోంది.



రైతు నాగలింగం(ఫైల్‌ఫొటో)

వార్త మెయిన్‌లో

గంజాయి నియంత్రణలో 'కూటమి' విఫలం



మహాసభల్లో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్

◆ విద్యారంగ సమస్యలపై పోరాటం ◆ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ ◆ గుంతకల్లులో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌ను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ విమర్శించారు. రెండు రోజుల పాటు జరిగిన ఎస్ఎఫ్ఐ 33వ జిల్లా మహాసభలు గుంతకల్లు పట్టణంలో గురువారం ముగిశాయి. మహాసభల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి ముఠాలుగా ఏర్పడి విచ్చలవిడిగా గంజాయిని అమ్ముతున్నారని తెలిపారు. దీని వల్ల యువత జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. ఓవైపు ప్రభుత్వం గంజాయిని అరికడతామని, డ్రగ్స్ నియంత్రిస్తామని గొప్పలు చెబుతున్నా ఆచరణలో మాత్రం కన్పించలేదన్నారు. రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహిత మారుస్తామంటూ చెబుతున్న మాటలు నీటిమూటలుగా మారాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మాటలు మాని చేతల్లో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇక రాష్ట్రంలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. జూనియర్ కళాశాలలో విద్యార్థులు భోజనాలు చేయడానికి డైనింగ్ హాల్ లేవన్నారు. సంక్షేమ హాస్టల్లో తాగునీటికి దిక్కు లేదన్నారు. డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫీజులు చెల్లించకపోవడంతో ప్రయివేటు కళాశాలల యజామాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. పిపిపి పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనుక్కు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. మహాసభలో పట్టణ నాయకులు కిషోర్, హనీఫ్, జాక్, పవన్ పాల్గొన్నారు.

అధ్యక్ష కార్యదర్శులుగా తరిమెల గిరి, ఓతూరు పరమేష్

మహాసభల్లో భాగంగా ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులుగా తరిమెల గిరి, ప్రధాన కార్యదర్శిగా ఓతురు పరమేష్, ఆఫీసు బెరర్లుగా బంధు శివ, రాచపల్లి సూర్యప్రకాష్, వెంకటేష్, భీమేష్, నవీన్, హారుణ్ రషీద్, శాంతిరాజ్‌ను ఎన్నుకున్నారు.

నిబంధనలతో పత్తి రైతుకు నష్టం

◆ మద్దతు ధరతో పంటను కొనుగోలు చేయాలి ◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-గుత్తి



మార్కెట్‌యార్డు వద్ద రైతులతో కలిసి రాస్తారోకో చేస్తున్న సిపిఎం, రైతుసంఘం నాయకులు



రాస్తారోకోలో ప్రసంగిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనలను సడలించి రైతులు సాగు చేసిన పత్తిని ప్రభుత్వం గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. నిబంధనలను సడలించి రైతులకు మేలుచేసేలా పత్తి పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం నాడు పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఎదురుగా రహదారిపై సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 72 వేల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారన్నారు. ఎకరాకు రూ.50 వేలు అప్పులు చేసి పెట్టుబడి పెట్టి రైతులు పంటలను సాగు చేస్తే అకాల వర్షాలతో దిగుబడులు రాక నష్టం వాటిల్లిందన్నారు. ఎకరాకు పది నుంచి 14 క్వింటాలు దిగుబడి రావాల్సి ఉంటే నాలుగు క్వింటాళ్లకు మించి పత్తి దిగుబడి రాలేదన్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.8,110 మద్దతు ధర ప్రకటించి పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని చెప్పి జిల్లాలో గుత్తి, తాడిపత్రిలో మాత్రమే ఏర్పాటు చేశారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కపాస్ కిసాన్ యాప్, సీఎం యాప్‌లలో స్లాట్ నమోదు చేయాలని వ్యవసాయ అధికారులు చెప్పడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారన్నారు. గుత్తి మార్కెట్ యార్డుకు 15 వాహనాల్లో రైతులు పత్తిని విక్రయించడానికి తీసుకువస్తే నాణ్యత లేదని సాకుతో ఏడు వాహనాల పత్తిని వెనక్కి పంపారన్నారు. చేసేది లేక రైతులు బయట దళారులకు క్వింటాళ్లకు రూ.6500తో విక్రయాలు సాగిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కపాస్ కిసాన్ యాప్ రద్దుచేసి సిసిఐ నిబంధనలను సడలించి ఈ క్రాప్ ఆధారంగా రైతులు సాగుచేసిన పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, సిటిటియు డివిజన్ కార్యదర్శి సాకే నాగరాజు, ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు రేవతి, ఎన్.రేణుక, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు చందు, ఎం.మల్లేష్, సిఐటియు నాయకుడు సి.రమేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్ యాదవ్, రైతు సంఘం జిల్లా కమిటీ నాయకులు దస్తగిరి, మద్దిలేటి, వన్నూరమ్మ, ఊర్మిళ పాల్గొన్నారు.

పేదల గుడిసెలను కూల్చొద్దు : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరం కమలానగర్ డిసిఎంఎస్ కార్యాలయం దగ్గర గత 50 సంవత్సరాల నుంచి జీవనం సాగిస్తున్న పేదల గుడిసెలను కూల్చద్దని సిపిఎం నాయకులు కోరారు. డిసిఎంఎస్ కార్యాలయం వద్ద నివసిస్తున్న పేదలను సిపిఎం నగర కమిటీ నాయకులు గురువారం కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ డిసిఎంఎస్ కార్యాలయం వద్ద గత 50 సంవత్సరాలుగా 8 మంది నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. అక్కడ నివాస స్థలం ఇవ్వాలని పేదలు ఎన్నిసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలన్నా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం నివసిస్తున్న స్థలాలకు ఆ పేదలు ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు కడుతున్నారని చెప్పారు. ఆ ఇంటి నెంబర్‌పైనే రేషన్ కార్డు, ఆధార్ కార్డులు వచ్చాయన్నారు. ప్రభుత్వం నుంచే వచ్చే ప్రతి పథకం ఈ డోర్ నెంబర్ నుంచే వస్తున్నాయన్నారు. 50 సంవత్సరాలుగా ఉన్న వారిని ఇప్పుడు ఉన్నఫళంగా ఖాళీ చేయాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రస్తుతం నివసిస్తున్న గృహాలపై ఆధార్‌కార్డులు ఉండడంతో వీరికి ప్రభుత్వ స్థలం మంజూరు కాలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వారికి ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా అక్కడి నుంచి ఖాళీ చేయించడం సరికాదన్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో ధనవంతులు, పలుకుబడి కలిగిన పెద్దలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలు నిర్మించారన్నారు. అలాంటి వాటిని పట్టించుకోకుండా పేదలు నివసిస్తున్న గుడిసెలను తొలగించాలని చూడడం దుర్మార్గమన్నారు. డిసిఎంఎస్ వద్ద నివసిస్తున్న పేదలకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా వారిని అక్కడి నుంచి తొలగించాలని చూస్తే సిపిఎం వారికి అండగా నిలబడి పోరాటం చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్, ప్రకాష్, వలీ, నగర కమిటీ సభ్యులు ఎన్టీఆర్ శీన, రాజు, గఫూర్ పాల్గొన్నారు.



డిసిఎంఎస్ వద్ద నివసిస్తున్న పేదలతో మాట్లాడుతున్న సిపిఎం నగర నాయకులు

పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బిహెచ్ రాయుడు

ప్రజాశక్తి-రాయదుర్గం

మొక్కజొన్న, వరి, పత్తి పంటల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బిహెచ్.రాయుడు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గురువారం పట్టణంలోని కార్యాలయంలో తహశీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ప్రయివేట్ వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి ధరలను తగ్గిస్తూ రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధరలు ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర రావాలంటే అన్ని పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంటల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేని ప్రభుత్వం 'రైతన్న నీకోసం' అంటూ కార్యక్రమాలను చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న, వరి, పత్తి కొనుగోళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే అరటి సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు యన్ నాగరాజు మధు, తిమ్మరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే విత్తన చట్టం

బడా కార్పొరేట్ విత్తన కంపెనీల లాభాల కోసమే కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టాన్ని తీసుకొచ్చిందని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బిహెచ్ రాయుడు ఆరోపించారు. గురువారం రాయదుర్గంలోని ఆర్అండ్‌బి బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి రూ.వేలకోట్ల లాభాలను కార్పొరేట్ సంస్థలకు కొల్లగొట్టేందుకే నూతన విత్తన చట్టం తీసుకొచ్చిందన్నారు. 2004లో నాటి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన ముసాయిదా చట్టానికి 2010, 2019 సంవత్సరాల్లో సవరణలు చేసినప్పటికీ నేటికీ ఆమోదం పొందలేదన్నారు. తిరిగి 2025 విత్తన ముసాయిదా చట్టాన్ని తీసుకురావడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రాల స్థాయిలో నిపుణులతో సమావేశాలు ఏర్పాటు చేసి విత్తన చట్ట ముసాయిదాను రూపొందించాలని డిమాండ్ చేశారు.




వినతిపత్రం అందజేస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

15న మెరుపు సమ్మె

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలమవుతున్న నేపథ్యంలో ఈనెల 15న మెరుపు సమ్మె నిర్వహించనున్నట్లు మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎటిఎం నాగరాజు తెలిపారు. ఈమేరకు మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు వన్నూరుస్వామి, ప్రకాష్, నటరాజ్, దుర్గమ్మ తదితరులతో కలిసి మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఆశ్వర్థనారాయణకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పనిముట్లు సకాలంలో అందజేయాలని, ప్రజలకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని, నెలనెలా వేతనాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. ఇది వరకే కార్మికుల సమస్యలపై కమిషనర్ వంశీకృష్ణభార్గవ్‌కు పలుదపాలు విన్నవించుకున్న పరిష్కారం చూపలేదన్నారు. ఇందులో భాగంగానే ఈనెల15న విధులు ఆపుటకు కార్మికుల హక్కుల కోసం మెరుపు సమ్మె చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు పని భారం తగ్గించాలని, చాలీచాలని వేతనంతో పని చేస్తూ పనిముట్లు కూడా సొంతంగా కొంటూ విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులపై ఉన్నతాధికారుల కక్షసాధింపుల కారణంగానే వేతనం రాకుండా చేశారని ఆరోపించారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం 10రోజులు గడువు ఇస్తున్నామని.. ఆలోగా చేయకపోతే మెరుపు సమ్మె చేస్తామని హెచ్చరించారు.



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పెన్షన్‌దారులు డిఎల్‌సిలను ఇవ్వండి

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ 2026 సంవత్సరంకు సంబంధించి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్(డిఎల్‌సి) సమర్పించాలని ఉప ఖజానాధికారి సురేష్ బాబు సూచించారు. గురువారం స్థానిక పట్టణంలోని రాష్ట్ర పెన్షనర్ల భవనంలో పెన్షనుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ఖజానా కార్యాలయం, మీసేవ కేంద్రాలు, గుత్తి పెన్షనర్ల భవనంలో డిఎల్‌సి సమర్పించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వచ్చే ఏడాది జనవరి నుంచి ఫిబ్రవరి నెల ఆఖరిలోపు డిఎల్‌సి అందజేయాలన్నారు. విదేశాల్లో ఉన్నవారికి వీడియో కాల్ ద్వారా డిఎల్‌సిని ఆమోదిస్తామన్నారు. అనారోగ్య గురైన వారికి సమాచారం ఇస్తే ఇంటి వద్ద ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు కె.అబుబకర్, ఉపాధ్యక్షులు స్వర్ణాంబ, షెక్షావలి, కార్యదర్శి రామ్మోహన్, కోశాధికారి జెన్నే కుళ్లాయి బాబు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలి

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నగరంలోని కార్యాలయంలో డిఇఒ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని కోరారు. అలాగే గార్లదిన్నె మండలం ఎంపిపిఎస్ పెనకచెర్ల మెయిన్ స్కూల్‌లో పిల్లల సంఖ్య 26 ఉందని ఇక్కడ సింగల్ టీచర్ మాత్రమే ఉన్నారన్నారు. సింగల్ టీచర్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు సెలవులు ఉపయోగించుకోవాల్సి వచ్చినప్పుడు ఉపాధ్యాయులను ఏర్పాటు చేసుకోవాలని ఎంఇఒలు చెప్పడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు లింగమయ్య రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య జిల్లా కార్యదర్శి రాముడు పూర్వపు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



డిఇఒ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

సమస్యల సాధనకు పోరాటాలు

సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వివిఎల్



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

రైల్వే లోకో రన్నింగ్ సిబ్బంది డిమాండ్ల సాధనకు పోరాటాలు కొనసాగిస్తామని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు వివిఎల్ నరసింహులు అన్నారు. గుత్తి రైల్వే లోకో కంట్రోల్ లాబీ వద్ద రన్నింగ్ సిబ్బంది చేపట్టిన నిరాహార దీక్షలకు గురువారం మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లకు 8 గంటలకంటే అధికంగా పని చేయిస్తున్నారన్నారు. వారాంతపు విశ్రాంతి అరకొరగా ఉంటోందన్నారు. నూతన పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి, పాత పెన్షన్ స్కీంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లకు పని భారం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి సాకే నాగరాజు, నాయకులు సి.రమేష్, మురళి, ఆలిండియా లోక రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శి డి.హరికృష్ణ, సహాయ కార్యదర్శి ఎండి.హక్, ఎస్ఎఫ్ఐ నాయకుడు నవీన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అహుడా అభివృద్ధిని వేగవంతం చేయండి

చైర్మన్ టిసి వరుణ్, జెసి శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అహుడా అభివృద్ధిని వేగవంతం చేయాలని అహుడా చైర్మన్ టిసి.వరుణ్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని అహుడా కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణలో మరింత పురోగతి సాధించాలన్నారు. ఎంఐజి లేఅవుట్‌లు, ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతిప్లాట్ కొనుగోలుదారుడు సంతృప్తి చెందాలన్నారు. నగరంలో పింక్ టాయిలెట్ల ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రాచనపల్లి ఎంఐజి లేఅవుట్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కెఎండి.ఇషాక్, ఎగ్జిక్యూట్ ఇంజినీర్ దుష్యంత్, డిఇ రేవంత్, జెపిఒ హరీష్‌చౌదరి, పబ్లిక్ హెల్త్ విభాగం ఇంజినీర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా

ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. తాడిపత్రిలో రూ.4కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఓపెన్ డ్రెయిన్ ఉండటంతో ఇక్కడ నివాసముంటున్న ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు గమనించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో చేస్తూ రుణం తీర్చుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ డిఇ రామ్‌ప్రసాద్‌రెడ్డి, టిడిపి నాయకులు ఎస్‌వి.రవీంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, జెసి నరేష్‌రెడ్డి, జెసి సుదీప్‌రెడ్డి, టిడిపి కౌన్సిలర్లు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో పలువురికి మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను ఆయా బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. రూ.46లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందించారు.

వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం అమోఘం

విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఓ.పెద్దన్న

ప్రజాశక్తి-కూడేరు



వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం అమోఘమని విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఓ.పెద్దన్న హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఏడు వరాలు ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. అందరితోపాటు దివ్యాంగులకు సమాన అవకాశాలు, హక్కులు గౌరవం కల్పించేందుకు, అనుకూలమైన సమాజాన్ని నిర్మించాలనే దృఢ సంకల్పంతో, దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం అమోఘమైన విషయమని ఆనందం వ్యక్తం చేశారు. రూ.19 కోట్లతో దివ్యాంగుల ఆర్థిక సబ్సిడీ పునరుద్ధరణ, ఉచిత బస్సు ప్రయాణం, స్థానిక సంస్థల్లో ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా నియామకం, దివ్యాంగుల్లో క్రీడాస్ఫూర్తిని నైపుణ్యతను గుర్తించేందుకు ప్రత్యేక ట్యాలెంట్ డెవలప్‌మెంట్ స్కీమ్, టిక్కో ఇళ్లల్లో గ్రౌండ్ ఫ్లోర్ ప్లాట్లు కేటాయింపు, బదిరులకు ప్రత్యేక కళాశాల, దివ్యాంగ విద్యార్థులకు ఎక్కడుంటే అక్కడే పింఛన్ పంపిణీ, అమరావతిలో ప్రత్యేక భవన నిర్మాణం లాంటి ఏడు వరాలను ప్రకటించడం సంతోషకరమన్నారు.

పంటను దళారుల చేతుల్లో పెట్టి మోసపోవద్దు

విప్ కాలవ శ్రీనివాసులు




వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-కణేకల్

రైతుల ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ప్రయివేటు వ్యాపారుల చేతుల్లో పెట్టి మోసపోవద్దని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. గురువారం కణేకల్లులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణంగా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేవారన్నారు. దీంతో పంట ఉత్పత్తులు చేతికి అందగానే చిన్న, సన్నకారు రైతులకు నిల్వ చేసుకోవడానికి సౌకర్యం లేకపోవడం, ఆర్థిక సమస్యలతో తక్కువ ధరకే ప్రయివేట్ వ్యక్తులకు అమ్ముకుంటున్నారన్నారు. కొంతమంది ప్రయివేట్ వ్యక్తులు ఇదే అదునుగా భావించి రైతుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తూ వస్తున్నారన్నారు. రైతులు ఎవరి చేతుల్లో మోసపోకూడదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈసారి రైతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టారన్నారు. ఇందులో భాగంగానే పంట చేతికి వస్తానే కనీస మద్దతు ధరతో కొనుగోలు చేసేలా కేంద్రాలు ఏర్పాటు చేయించారన్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో 15వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతించగా 13,912 మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో 25వేల మెట్రిక్ టన్నులు సేకరణకు ప్రభుత్వం ముందే అనుమతి ఇచ్చిందన్నారు. అవసరమైతే ఉన్నత స్థాయిలో చర్చించి అదనపు కొనుగోళ్లకు అనుమతి తీసుకుంటామన్నారు. అనంతరం కణేకల్లు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కొత్తగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. తర్వాత మండలంలోని మాల్యం-నాగేపల్లి గ్రామాల మధ్య రూ.1.47 కోట్లతో తుంగభద్ర ఎగువ కాలువపై నిర్మించిన నూతన వంతెనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వన్నారెడ్డి, ఆనంద్‌రాజ్, లాలెప్ప, రైస్‌మిల్ చంద్ర, రమేష్, చాంద్‌బాషా, మాబుసాబ్, నాగార్జున, బసవరాజ్, సుదర్శన్, ఆది, మారుతి, ముజ్జు, జిన్నా, బాబు, శరవన్ గౌడ్, తహశీల్దార్ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ వహించాలి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు


ప్రజాశక్తి-పుట్లూరు

ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 'ప్రజా దర్బార్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణిశ్రీ నేరుగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఇందులో భాగంగా గ్రామాల్లో విద్యుత్ వీధిదీపాలు, శ్మశాన వాటికల్లో కంపచెట్లు, వ్యర్థాల తొలగింపు, ప్రహరీల ఏర్పాటుకు, తదితర సమస్యలపై 150 అర్జీలను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రీ-సర్వే కారణంగా వచ్చిన భూముల సమస్యలు, ఎస్సీల భూముల ఆక్రమణలపై అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. సూరేపల్లి ఎస్సీ కాలనీలో ట్యాంకు ద్వారా నీటిని సరఫరా చేసే పైప్‌లైన్లలో ఉన్న వ్యర్థాలను తొలగించి, రెండు రోజుల్లో నీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఇకపోతే మండలంలోని గేట్ల మరమ్మతుల కారణంగా సుబ్బరాయసాగర్ ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదలలో ఆలస్యం అయిందన్నారు. విషయాన్ని ఇప్పటికే సిఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఉన్నత స్థాయి అధికారులు పరిశీలించి గేట్ల మరమ్మతులను త్వరగా పూర్తి చేసి సాగునీటి విడుదలకు కృషి చేస్తామన్నారు. అలాగే ఇటీవల అరటి పంటకు గిట్టుబాటు ధర తగ్గడంతో రైతులు ఇబ్బంది పడ్డారని, అయితే ప్రస్తుతం ధర ఆశా జనకంగా ఉండేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వినతి

మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి కోరారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఇల్లు, స్థలాలు, తాగునీరు, బీసీ హాస్టల్ ప్రహరీ, తాగునీటి సమస్య, కస్తూరిబా పాఠశాలలో సమస్య, సిసి రోడ్లు, వీధిలైట్లు, డ్రెయినేజీ కాలువలు వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు టి.పెద్దయ్య, జె.పెద్దయ్య, బి.భాస్కర్‌రెడ్డి, కె.నాగభూషణ్, ఆర్.రాఘవరెడ్డి, శివారెడ్డి, ఆదినారాయణ, జయ, దేవి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం



కార్మికుల దీక్షలో పాల్గొన్న ప్రజసంఘాల నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు అన్యాయం చేస్తే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రజాసంఘాల నాయకులు హెచ్చరించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు చేపట్టిన రిలేదీక్షలు గురువారం నాటికి 20వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో కార్మిక నాయకులు వన్నూరుస్వామి, తిప్పేస్వామి, చిత్తప్ప, లింగమయ్య, వన్నూరప్ప కూర్చొన్నారు. దీక్షలకు ప్రజాసంఘాల నాయకులు గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పేస్వామినాయక్, దళిత జనజాగృతి అధ్యక్షుడు ఆర్కె రాజు, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు సాకే గురుమూర్తి, వైసీపీ ఎస్సీసెల్ నాయకుడు గూనిపల్లి నాగరాజు, విద్యార్థి విభాగం నాయకులు షేక్షావలి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు రాత్రింబవళ్లు తాగునీరు అందిస్తున్న కార్మికులకు అన్యాయం చేయడం సహించమన్నారు. అంతేగాకుండా కార్మికులను వివిధ కారణాలతో తొలగిస్తామని బెదిరించడం, ఖాళీ బాండ్లలో సంతకాలు చేయించుకుని మోసం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. దౌర్జన్యానికి పాల్పడుతున్న తాగునీటి పథకం కాంట్రాక్టర్ అడపాల వెంకట్రావు, ఆయన మనుషులు గౌతమ్, కిరణ్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేయకపోతే జిల్లా స్థాయిలో ఉద్యమాలకు పిలుపునిస్తామన్నారు.

క్రమశిక్షణ, పోటీతత్వం పెంచడంలో క్రీడల పాత్ర కీలకం

జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు



మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి హెచ్.సుదర్శనరావు


ప్రజాశక్తి-అనంతపురం

క్రీడలు విద్యార్థుల్లో మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ, పోటీతత్వం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని జెఎన్‌టియు వైస్‌ఛాన్స్‌లర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. గురువారం స్థానిక రుద్రంపేటలోని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాల(అటానమస్)లో ఇంటర్ జూనియర్ కళాశాలల క్రీడా మహోత్సవం ప్రారంభమైంది. తొలుత క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జెఎన్‌టియు విసి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంచుతాయన్నారు. క్రికెట్, కబడ్డీ, బాస్కెట్‌బాల్, లాంగ్‌జంప్, హైజంప్ వంటి 15కి పైగా విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీబాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె కిషోర్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే లక్ష్యంతో తమ కళాశాల చదువుతోపాటు క్రీడా వసతులను విస్తృతంగా అభివృద్ధి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పల్లె సింధూర, ప్రత్యేకాధికారి శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, పివికెకె డిప్లొమా ప్రిన్సిపాల్ వైభవ్, బాలాజీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఎఒ మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో 'నగరవనం' ప్రారంభం

కళ్యాణదుర్గం రూరల్ : అటవీశాఖ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసిన నగరవనం పార్కును త్వరలోనే ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. ఈమేరకు ఆర్‌డిఒ, మున్సిపల్ కమిషనర్, అధికారులతో కలిసి నగరంలోని నగరవనం పార్కు ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కును త్వరలో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ వర్చువల్‌గా ప్రారంభిస్తారా.. లేక ఇక్కడికి నేరుగా వచ్చి ప్రారంభిస్తారా అనేది నిర్ణయించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ వసంత్‌బాబు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, అటవీశాఖ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

హార్మోన్ల అసమతుల్యతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ ప్రసూన

అనంతపురం : హార్మోన్ల అసమతుల్యతపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ ప్రసూన సూచించారు. గురువారం నగరంలోని ఆజాద్‌నగర్‌లో ఉన్న నవభారత్ పాఠశాలలో కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్, జెవివి ఆధ్వర్యంలో 'ఆడపిల్లలు శక్తిమంతులుగా తయారుకావడం ఎలా' అనే అంశంపై బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ అమ్మాయిలు విద్య, జ్ఞానం, ఆరోగ్యంలో శక్తిమంతులుగా తయారు కావాలన్నారు. అప్పుడే భవిష్యత్తులో మంచి విద్యావంతులుగా ఎదిగితే రాబోయే తరానికి మంచి పునాది వేసిన వారు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిట్టూరు కృష్ణవేణి, నిట్టూరు అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి పిఆర్ విభాగం కర్నూలు ఇన్‌ఛార్జిగా సివి.రంగారెడ్డి



గుత్తి : వైసిపి పంచాయతీ రాజ్ విభాగం కర్నూలు ఇన్‌ఛార్జిగా గుత్తి పట్టణానికి చెందిన సివి.రంగారెడ్డి నియమితులయ్యారు. వైసిపి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఉన్న ఆయన్ను అధిష్టానం కర్నూలు ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈమేరకు పిఆర్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు.

గూగూడుకు పోటెత్తిన భక్తులు

నార్పల : మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వాముల దర్శనానికి భక్తులు గురువారం పోటెత్తారు. ఇందులో భాగంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కుళ్లాయిస్వామికి చక్కెర చదివింపులు చేశారు. కాగా భక్తులు భారీగా తరలిరావడంతో సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆలయం బయట ఎలాంటి క్యూలైన్ లేకపోవడంతో కుళ్లాయిస్వామి దర్శనానికి మహిళలు ఇబ్బందులు పడ్డారు. దీనికితోడు అగ్నిగుండం చుట్టూ ఆవులు సంచరిస్తుండడంతో అటు భక్తులు.. అటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు భక్తుల ఇబ్బందులను గుర్తించి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరారు.

డివిజన్ అభివృద్ధి కార్యాలయం ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించిన డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్



అనంతపురంలో డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ప్రారంభిస్తున అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం రూరల్ మండలం సచివాలయంపై ఏర్పాటు చేసిన అనంతపురం డివిజన్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. మండల అధ్యక్షురాలు గుజ్జల వరలక్ష్మి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం డివిజన్ అభివృద్ధి కార్యాలయాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఒ నాగరాజు నాయుడు, డ్వామా పీడీ సలీం భాషా, ఎంపిడిఒ దివాకర్, సర్పంచు ఉదయ్‌శంకర్, ఎంపిటిసిలు ఆశాజ్యోతి, ఆదినారాయణ, మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : కళ్యాణదుర్గం డివిజినల్ డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయాన్ని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కార్యాలయం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

కించపరిచే పోస్టులు పెట్టడం తగదు : కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

తనను కించ పరిచే విధంగా పోస్టులు పెట్టడం తగదని మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో అన్నారు. నియోజకవర్గంలో టిడిపికి చెందిన కొంతమంది తమను బిజెపి కార్యకర్తలు వేరే పార్టీలో ఉన్నప్పుడు ఏదో అన్నారని విమర్శిస్తూ.. అవమానపరుస్తూ వేధింపులకు గురి చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారన్నారు. ఇలా చేయడం తగదన్నారు. రాజకీయంగా ఎదుర్కోవడం పరిపాటే కానీ పొత్తులో కలిసి పని చేస్తున్నప్పుడు వాటిని వదులుకోవాలన్నారు. అలాకాకుండా ద్వేషపూరితమైన అవమానకరమైన వేధింపులకు గురి చేసే విధంగా పోస్టులు పెట్టి వేధిస్తే బిజెపి చూస్తూ ఊరుకోదన్నారు. వేధింపులు ఆపకపోతే గతంలో జరిగిన అనేక ఘటనల పూర్తి సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు.

బకాయి వేతనాలు చెల్లించాలి : సిఐటియు



ఆందోళన చేస్తున్న కార్మికులు, సిఐటియు నేతలు

ప్రజాశక్తి-రాప్తాడు

గ్రామ పంచాయతీల్లో పని చేసే కార్మికులకు ఐదు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు పంచాయతీ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నా కనీసం వేతనాలు చెల్లించకపోతే ఎలా.. అని వాపోయారు. ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. వెంటనే వేతనాలతోపాటు పలు సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రవి, కదిరప్ప, లక్ష్మీదేవి, ఆదెబ్బ, తదితరులు పాల్గొన్నారు.

12న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల తెలిపారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్త ధర్నాలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను మూతవేసి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నామన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ26వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని, హెల్పర్లకు ప్రమోషన్లు విషయంలో రాజకీయ జోక్యం తగదని, ఆన్‌లైన్ పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు తిప్పీరమ్మ, కార్యదర్శి పార్థమ్మ, కోశాధికారి రాధమ్మ, అంగన్‌వాడీ టీచర్లు తిప్పక్క, తులసి, వరలక్ష్మి, పద్మావతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఈనెల 31 నుంచి విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభలకు తరలివెళ్దామని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎటిఎం నాగరాజు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల పిలుపునిచ్చారు. ఈమేరకు కళ్యాణదుర్గంలో గురువారం ప్రాజెక్టు అధ్యక్షురాలు తిప్పీరామ్మ, కోశాధికారి రాధమ్మతో కలిసి మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు వరలక్ష్మి, పద్మ, తులసి, లక్ష్మి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం, మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు వన్నూరుస్వామి, ఎం.వన్నూరుస్వామి, ప్రకాష్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో కాన్పులు జరగాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ప్రతి గర్భిణీ తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేసుకోవాలని వైద్యాధికారి రాజేష్‌కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని బ్రహ్మసముద్రం, భైరసముద్రం, వేపులపర్తి-2, పిల్లలపల్లి సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల్లోని గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. దాదాపు 22 మందికి బిపి, షుగర్, వంటి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాణిఎస్తేర్, సూపర్‌వైజర్ రామలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, ఎఎన్‌ఎం ఉమా, ల్యాబ్ టెక్నీషియన్ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నీలకంటేశ్వర స్వామి రథోత్సవం

డి.హీరేహాల్ : మండల కేంద్రంలో వెలసిన నీలకంటేశ్వర స్వామి రథోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. అనంతరం వేలాదిమంది భక్తుల నామస్మరణతో రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రం నుంచే కాకుండా కర్నాటక నుంచి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ముఖ్యఅతిథిగా వైసిపి నాయకులు మెట్టు విశ్వనాథరెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

'ఘంటశాల'కు నివాళి

అనంతపురం : పద్మశ్రీ ఘంటశాల వెంకటేశ్వర్‌రావు జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక లలితకళా పరిషత్‌లో కార్యదర్శి పద్మజ నేతత్వంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎల్కెపి సభ్యులు పాల్గొన్నారు .

8న పీజీ కోర్సుల ప్రవేశానికి అడ్మిషన్లు

అనంతపురం : శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ పరిధిలోని వివిధ పీజీ కోర్సుల్లో మిగిలిన సీట్లు భర్తీకి ఈనెల 8వతేదీన స్పాట్ అడ్మిషన్లు ద్వారా ప్రవేశాలు నిర్వహించనున్నట్లు సంచాలకులు జి.నరసింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరై అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

'మాంటిస్సోరి' విద్యార్థుల క్రీడా ప్రభంజనం


రాప్తాడు : మండలంలోని గొల్లపల్లి గ్రామం వద్ద ఉన్న మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు క్రీడల్లో ప్రభంజనం సృష్టించారు. వివిధ స్థాయిల్లో (ఎస్‌జిఎఫ్) నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు మాంటిస్సోరి ఎలైట్ పాఠశాల ఎండి కృష్ణభరత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి, దేశస్థాయిలో రాణించడం గర్వించదగ్గ విషయమన్నారు. విద్యతో పాటు క్రీడలో తమ విద్యార్థులు ఉత్తమ స్థాయిలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఆయా విద్యార్థులను కరెస్పాండెంట్ కృష్ణ సమీర, ప్రధానోపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, కళాశాల ఇన్‌ఛార్జి మధు, తదితరులు అభినందించారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే శిక్షార్హులు

అనంతపురం సిటీ : పదవ తరగతి పరీక్ష ఫీజు ప్రభుత్వం నిర్ణయించిన దాని కంటే అధికంగా వసూలు చేస్తే చట్టపరంగా శిక్షార్హులు అవుతారని డిఇఒ ప్రసాద్‌బాబు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సాధారణ విద్యార్థుల పరీక్ష ఫీజు రూ.125 మాత్రమే అన్నారు. పాఠశాలలు అధిక ఫీజు డిమాండ్ చేసిన పక్షంలో విద్యార్థులు సెల్ఫ్ పేమెంట్ ప్రొవిజన్‌ను ఉపయోగించి స్వయంగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన వన్నూరుస్వామి

బెలుగుప్ప : కడుపు నొప్పి తాళలేక తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి మండల పరిధిలోని ఆవులెన్న గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆవులెన్న గ్రామానికి చెందిన హరిజన వన్నూరుస్వామి (44) కడుపు నొప్పి భరించలేక తాగుడుకు బానిసయ్యాడు. ఈనేపథ్యంలో వారంరోజుల క్రితం భార్య, కూతురు పుట్టిళ్లు రామేపల్లికి వెళ్లారు. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి కడుపునొప్పి రావడంతో భరించలేక ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమణించిన స్థానికులు బంధువులు, పోలీసులకు సమాచారం అందించారు. భార్య రామాంజనమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాట జూదరులు అరెస్టు

బెలుగుప్ప : మండల కేంద్రంలోని మంగోటి చెరువు వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని మంగోటి చెరువు వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి నిందితుల నుంచి రూ.10.250 నగుదు, పేక ముక్కలను స్వాధీనం తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.